క్లుప్తంగా

బడిఈడు పిల్లల గుర్తింపు



పిల్లల్ని స్కూల్‌లో చేర్పిస్తున్న అధికారులు

ఆకివీడు : బడి ఈడు పిల్లల్ని గుర్తించి పాఠశాలల్లో చేర్పిస్తున్నట్టు ఎంపీడీఓ కందుల వాణి తెలిపారు. ఆకివీడు మండలం కాళింగగూడెంలో ప్రాథమికోన్నత పాఠశాలలో నలుగురి పిల్లల్ని శనివారం చేర్పించారు. మండలంలో బడి ఈడు పిల్లలు బడి బయట ఉండకుండా ప్రత్యేక డ్రైవ్ చేపట్టామని ఎంపీడీఓ తెలిపారు. దీనికి ప్రజా ప్రతినిధులు, సచివాలయ సిబ్బంది, వలంటీర్లు సహకరించాలని కోరారు. ఎంఈఓ-2 సీతారామయ్య మాట్లాడుతూ పాఠశాలల్లో రెండో విడత నాడు – నేడు పనులను వేగవంతానికి చర్యలు చేపట్టామన్నారు.

ఫ్యాన్ల బహూకరణ



ఆర్‌జేడీ కృష్ణను సత్కరించిన దృశ్యం

సాక్షి, భీమవరం: స్వచ్ఛంద సంస్థలు, దాతలు మానవీయ కోణంతో సహకరించాలని రాజమహేంద్రవరం ఆర్‌జేడీ సీహెచ్ కృష్ణ అన్నారు. శనివారం స్థానిక ఆర్ఆర్‌డీఎస్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలను ఆయన సందర్శించారు. కళాశాలలో విద్యా సంబంధమైన కార్యకలాపాలను ఆయన పర్యవేక్షించారు. ఈ సందర్భంగా భీమవరం బ్యాంక్ ఆఫ్ బరోడా బ్రాంచ్ చీఫ్ మేనేజర్ జి.శ్రీనివాసరావు, జాయింట్ మేనేజర్ కేవీ నాగరాజు రూ.10 వేలు విలువైన సీలింగ్ ఫ్యాన్లను కళాశాల ప్రిన్సిపాల్ వీకే ప్రసూనకు అందజేశారు. అనంతరం ఆర్‌జేడీ కృష్ణను సత్కరించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఎస్ లక్ష్మీకాంతం, పి.అరవిందస్వామి తదితరులు పాల్గొన్నారు.

ఆపరేషన్ థియేటర్ ప్రారంభం



ఆపరేషన్ థియేటర్‌ను ప్రారంభిస్తున్న వీరాస్వామి

భీమవరం(ప్రకాశం చౌక్): కుటుంబ నియంత్రణ ఆపరేషన్ సేవలను ఉపయోగించుకోవాలని సూపరింటెండెంట్ ఎం.వీరస్వామి కోరారు. శనివారం భీమవరం ప్రభుత్వాసుపత్రిలో కుటుంబ నియంత్రణ ఆపరేషన్ థియేటర్‌ను ఆయన ప్రారంభించి మాట్లాడారు. అన్ని సౌకర్యాలతో ఏర్పాటుచేసిన ఈ థియేటర్‌లో మగ, ఆడవారికీ కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు చేస్తారని చెప్పారు. కార్యక్రమంలో ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కొప్పర్తి వీర రాఘవులు, పేరిచర్ల సత్యనారాయణ రాజు, డాక్టర్ బి.రమామహేశ్వరి, హెచ్‌వీ లలిత, ఏఎన్ఎం లలిత కుమారి ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఆదిత్య అచీవర్స్ డే

సాక్షి, భీమవరం : డిగ్రీ అయిన ప్రతి విద్యార్థి లక్ష్యం ఉద్యోగం సాధించడమేనని, ఉన్నతస్థాయికి చేరుకోవాలంటే ఉత్తమ చదువులు ఎంతో అవసరమని, ప్రఖ్యాత కంపెనీలలో ఉద్యోగాలు సాధించడం గొప్ప విశేషమని రాజమండ్రి ఆదికవి నన్నయ్య యూనివర్శిటీ వైస్ చాన్సలర్ కె.పద్మరాజు అన్నారు. భీమవరం ఆదిత్య డిగ్రీ కళాశాల 2022–23లో ఫైనల్ ఇయర్ విద్యార్థులు వివిధ కార్పొరేట్ సంస్థల్లో 1026 ఉద్యోగాలు సాధించిన సందర్భంగా స్థానిక త్యాగరాజ భవనంలో ఆదిత్య అచీవర్స్ డే వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదిత్య విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ ఎన్ శేషారెడ్డి మాట్లాడుతూ తమ కళాశాలలోని ప్రతి విద్యార్థీ డిగ్రీ అయిన వెంటనే ఒక చేతిలో డిగ్రీ పట్టా మరొక చేతిలో ఎంఎన్‌సీ కంపెనీలో ఉద్యోగం అందజేస్తున్నామని చెప్పారు. 1026 మంది విద్యార్థులు ఉద్యోగాలు సాధించడం ఆనందంగా ఉందని, ఇది వారి తల్లిదండ్రులు విజయమని అన్నారు. కార్యక్రమంలో సీఎస్ఎన్ విద్యాసంస్థల సెక్రటరీ చీడే సత్యనారాయణ, ప్రిన్సిపాల్ సకుమళ్ల సత్యనారాయణ, ఆదిత్య విద్యాసంస్థల రీజనల్ మేనేజర్ ఆర్ నాగేంద్ర బాబు, ప్రిన్సిపాల్ అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ బి.మావుళ్లు, వి.లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి



పేషెంట్‌ను పరీక్షిస్తున్న డాక్టర్ ధనలక్ష్మి

భీమవరం అర్బన్: వ్యాధుల పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని గొల్లవానితిప్ప పీహెచ్‌సీ డాక్టర్ ధనలక్ష్మి అన్నారు. ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమంలో భాగంగా శనివారం భీమవరం మండలం అనాకోడేరు గ్రామంలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి బీపీ, షుగర్, వైరల్ జ్వరాలు, దీర్ఘకాలిక వ్యాధి గ్రస్తులకు పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ధనలక్ష్మి మాట్లాడుతూ వర్షాకాలంలో సీజనల్, వైరల్ జ్వరాలు ఎక్కువగా వస్తాయన్నారు. ఫ్యామిలీ ఫిజీషియన్ కాన్సెప్ట్‌కు గ్రామాల్లో మంచి స్పందన వస్తోందని చెప్పారు. హెల్త్ సూపర్‌వైజర్లు, ఏఎన్ఎంలు, ఆశలు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారమే ధ్యేయం

- చంద్రబాబు, పవన్ కళ్యాణ్ మాటలను ప్రజలు నమ్మరు
- జగనన్న సురక్ష సభల్లో ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్



భీమవరం(ప్రకాశం చౌక్) 10వ వార్డులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గ్రంధి



భీమవరం అర్బన్: గొల్లవానితిప్పలో సర్టిఫికెట్ అందిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాస్

భీమవరం(ప్రకాశం చౌక్): ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా పనిచేస్తున్నామని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం పట్టణంలో శనివారం 10, 23, 36వ వార్డులో నిర్వహించిన జగనన్న సురక్ష సభల్లో ఎమ్మెల్యే శ్రీనివాస్ ముఖ్య అతిథిగా పాల్గొని లబ్ధిదారులకు పలు రకాల సర్టిఫికెట్లను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ సంక్షేమ పథకాలు నూటికి నూరుశాతం ప్రజలకు చేరాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి పనిచేస్తున్నారని, ఎక్కడైనా అర్హత ఉండి పథకాలు అందుకోలేని వారికీ న్యాయం చేయాలనే జగనన్న సురక్ష ప్రవేశపెట్టారని చెప్పారు. సీఎం జగన్ ఎన్నికల్లో ఇచ్చిన హామీల్లో 98 శాతానికి పైగా అమలు చేశారని వివరించారు. పేదలకు సీఎం జగన్ మేలు చేస్తుంటే సహించలేని చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు కుట్ర రాజకీయాలు చేస్తున్నారని ఆరోపించారు. చంద్రబాబు హయాంలో పేదలకు ఒక సెంటు స్థలం ఇచ్చారా అని ప్రశ్నించారు, జీతాలు పెంచాలని హైదరాబాద్ వెళ్లి ఆందోళన చేసిన అంగన్‌వాడీ టీచర్లను గుర్రాలతో తొక్కించారని, విద్యుత్ చార్జీలు తగ్గించాలని ఆందోళన చేసిన రైతులను తుపాకీలతో కాల్పించిన ఘటనలను ప్రజలు ఇంకా మర్చిపోలేదని గుర్తుచేశారు. చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లను ప్రజలు నమ్మే పరిస్థితి లేదన్నారు. వలంటీర్లపై చంద్రబాబు, పవన్ కళ్యాణ్‌లు చేసే విమర్శలను తిప్పి కొట్టాలని ప్రజలను కోరారు. రాష్ట్రంలో ఇల్లు లేని పేదలకు సుమారు 32 లక్షల మందికి స్థలాలను మంజూరు చేసి పట్టాలు ఇచ్చినట్టు చెప్పారు. తొలి విడత గృహ నిర్మాణాలు చురుగ్గా సాగుతున్నట్టు తెలిపారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ చైర్మన్ వేండ్ర వెంకటస్వామి, పార్టీ జిల్లా మహిళా అధ్యక్షురాలు గూడూరి ఉమాబాల, పార్టీ పట్టణ కన్వీనర్ తోట భోగయ్య, బీసీ సంక్షేమ జిల్లా అధ్యక్షుడు కోడే యుగంధర్, ఆయా వార్డు కన్వీనర్లు కానుబోయిన వెంకట రమణ, బొచ్చ ధర్మ, సోమాదుల పైడిరాజు, చిగురుపాటి రాజు, పోశిరెడ్డి బాలాజీ, బాలం శ్రీను, గుమ్మడి రాధిక, రేవూరి గోగురాజు, పట్టి వెంకటనర్సింహారావు, సాంబ్రాణి నాగలక్ష్మి, జేసీఎస్ కన్వీనర్లు చెల్లబోయిన సూర్యప్రకాష్, నల్లం రాంబాబు, గాదిరాజు తాతరాజు, పార్టీ నాయకులు పాలవెల్లి మంగ, నందమూరి ఆంజనేయులు, గంటా సుందర్‌కుమార్, కందికట్ల ఎడ్వర్డ్, బొక్కా గోపి, ఎండీ బాషా, వేండ్ర విజయదుర్గ, అల్లూరి నాగవల్లి, జట్ల రాంబాబు, పోతుల జక్రి, పాలపర్తి జోనా తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు ధ్రువ పత్రాల అందజేత

వీరవాసరం: మండలంలోని మత్స్యపురి, ఉత్తరపాలెం గ్రామాల్లో శనివారం జగనన్న సురక్ష శిబిరాలు నిర్వహించారు. లబ్ధిదారులకు ధ్రువ పత్రాలను అందజేశారు. కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ కోటిపల్లి బాల దుర్గా నాగమల్లేశ్వరరావు (బాబు), గూడూరు ఓంకారం, కోడె వరలక్ష్మి, గూడూరి ధనలక్ష్మి, కోడె అప్పారావు, గొలగాని సత్యనారాయణ, మానుకొండ ప్రదీప్ కుమార్, కడలి ధర్మారావు, గెద్దం భాస్కరరావు, యరకరాజు చినబాబు, కురెళ్ల కాశి తదితరులు పాల్గొన్నారు.

మళ్లీ జగనన్నే సీఎం

ఆకివీడు: సంక్షేమం, అభివృద్ధి, సుపరిపాలనకు ప్రజలు మళ్లీ పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉన్నారని, జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ సీఎం అవుతారని ఆకివీడు నగర పంచాయతీ చైర్‌పర్సన్ జామి హైమావతి అన్నారు. స్థానిక సచివాలయం 5లో సుఫీ ఖాదరీ ఫంక్షన్ హాలులో శనివారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. సీఎం జగన్ ప్రజా సంక్షేమం కోసం వివిధ పథకాలు అమలు చేస్తున్నారని చెప్పారు. ప్రజలకు పారదర్శకంగా సేవలందించేందుకు ఏర్పాటుచేసిన వలంటీర్ల వ్యవస్థ దేశ వ్యాప్తంగా గుర్తింపు పొందిందని వివరించారు. వలంటీర్లపై ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలు దెయ్యాలు వేదాలు వల్లించినట్లున్నాయని ఆరోపించారు. టీడీపీ హయాలో జన్మభూమి కమిటీలపేరుతో దోచుకున్నారని విమర్శించారు. పవన్ కల్యాణ టీడీపీ నేత చంద్రబాబుకు వలంటీర్‌గా పనిచేస్తున్నాడని ఆరోపించారు. కమిషనర్ జి.కృష్ణ మోహన్ మాట్లాడుతూ ఈ సచివాలయ పరిధిలో 1,080 ధ్రువ పత్రాల్ని అందజేశామన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ వైస్ చైర్మన్లు పుప్పాల పండు, వంగా జ్యోత్స్న, చీఫ్ విప్ పడాల శ్రీనివాస రెడ్డి, మెప్మా అధ్యక్షురాలు మోరా జ్యోతి రెడ్డి, కౌన్సిలర్లు గేదల అప్పారావు, దొడ్డి జగదీష్, కటికతల జాన్ వెస్లీ, తిమ్మారెడ్డి మాధవి, ఎండీ జక్కీ, గుండుగొలను సావిత్రి, శిరపు శ్రీనివాస్, గుండా సుందరరామనాయుడు, జోగి నాగరాజు, ఎండీ ఆలీ, సిద్దిక్, తిప్పా దుర్గాభవాని, ఉప్పాడ రామారావు, పలువురు బూత్ కన్వీనర్లు పాల్గొన్నారు.

రాష్ట్రానికి రక్ష

ఉండి: రాష్ట్ర ప్రజలందరికీ సీఎం జగన్ సంక్షేమ పాలనే రక్ష అని ఎంపీపీ ఇందుకూరి శ్రీహరినారాయణరాజు, జెడ్పీటీసీ రణస్తుల కనకదుర్గమహంకాళి అన్నారు. శనివారం ఉండి మండలం చెరుకువాడలో గ్రామ సర్పంచ్ కొండవేటి సాంబశివరావు (శివయ్య), ఉండిలో సర్పంచ్ కమతం సౌజన్యబెన్ర్జీ అధ్యక్షతన జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీపీ, జెడ్పీటీసీలు మాట్లాడుతూ ప్రజలంతా జగనన్న సురక్ష పాలననే మళ్లీ కోరుకుంటున్నారని చెప్పారు. వివిధ ధ్రువ పత్రాలను దరఖాస్తుదారులకు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ ఏవీ అప్పారావు, ఏఎస్‌ఓ పి.రామారావు, రాష్ట్ర డైరెక్టర్లు గులిపల్లి అచ్చారావు, కొవ్రపాటి అనిత, పార్టీ గ్రామ అధ్యక్షుడు కొండవేటి సత్యనారాయణ, ఉండి ఉప సర్పంచ్ గొట్టుముక్కల కళ్యాణ్ వర్మ, ఎంపీటీసీ చిగురుపాటి క్రిష్టాఫర్, పార్టీ నాయకులు రణస్తుల మహంకాళి, బొడ్డు నాగన్న, బందెల ప్రమీల, బందెల జార్జ్‌రాజు, సురక్ష మండల కన్వీనర్ బి.రామకృష్ణ, పంచాయతీ కార్యదర్శి కె.గోపాలకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సమస్యలకు పరిష్కారం

కాళ్ల: జగనన్న సురక్ష ద్వారా ప్రజా సమస్యలకు అక్కడికక్కడే పరిష్కారం దొరుకుతుందని ప్రజా ప్రతినిధులు, అధికారులు తెలిపారు. శనివారం కాళ్ల మండలం కలవపూడి, మాలవానితిప్ప గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. సర్పంచ్‌లు సాగిరాజు సుబ్బరాజు, జాన్, కల్వపూడి సొసైటీ అధ్యక్షుడు పెనుమత్స దుర్గాప్రసాద్ రాజు, ఎంపీపీ పెనుమత్స విశ్వనాథరాజు, బర్రి గంటయ్య, తోటకూర చిన్న, మండల ప్రత్యేక అధికారి కె.కిషోర్ కుమార్, తహసీల్దార్ కృష్ణారావు, ఎంపీడీఓ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

ప్రతి కుటుంబానికీ మేలు

భీమవరం అర్బన్: సంక్షేమ పథకాలకు అర్హతున్న ప్రతి కుటుంబానికీ జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా మేలు జరుగుతోందని ఎమ్మెల్యే గ్రంధి శ్రీనివాస్ అన్నారు. భీమవరం మండలం గొల్లవానితిప్ప, దొంగపిండి శనివారం జగనన్న సురక్ష కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే శ్రీనివాస్ మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత నాలుగేళ్లలో 98 శాతం పైగా హామీలను నెరవేర్చి ప్రజల విశ్వాసాన్ని పొందారని వివరించారు. గొల్లవానితిప్పలో 4,150, దొంగపిండిలో 1,276 సర్టిఫికేట్లను అర్హులకు అందజేశారు. కార్యక్రమాల్లో ఎంపీపీ పేరిచర్ల విజయ నరసింహరాజు, జెడ్పీటీసీ కాండ్రేగుల నరసింహారావు, తహసీల్దార్ వై.రవికుమార్, ఎంపీడీఓ కె.వెంకటలక్ష్మి, వైస్ ఎంపీపీ తిరుమాని గంగా భవాని, సర్పంచ్‌లు చిల్లే వెంకటేష్, ఉప సర్పంచ్ బుద్ధాల రామకృష్ణ, గుద్దటి రవికుమార్, గుద్దటి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ తిరుమాని బాలచంద్రరావు, రేవు రాంబాబు, రేవు నాగరాజు, జేసీఎస్ కన్వీనర్ కోమటి రాంబాబు, కొట్టి కుటుంబరావు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కోడె యుగంధర్, కోళ్ల బాలకృష్ణ, నామన మహేష్ తదితరులు పాల్గొన్నారు.



ఆకివీడు వెలంపేటలో ధ్రువ పత్రాలను అందజేస్తున్న హైమావతి



ఉండి: చెరుకువాడలో ధ్రువ పత్రాలను అందిస్తున్న దృశ్యం



కాళ్ల: కలవపూడిలో సర్టిఫికెట్స్ అందజేస్తున్న ప్రజాప్రతినిధులు



వీరవాసరం: ఉత్తరపాలెంలో సర్టిఫికెట్లు అందజేస్తున్న దృశ్యం

తిరునక్షత్ర మహోత్సవం



ఆండాళ్ అమ్మవారు

కాళ్ల: కాళ్లకూరు వేంకటేశ్వరస్వామి దేవస్థానంలో శనివారం ఆండాళ్ (గోదాదేవి) అమ్మవారికి తిరునక్షత్రం మహోత్సవం భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. అర్చకులు, వేద పండితులచే తొలుత అమ్మవారికి తిరుప్పావై సేవాకాల ం నిర్వహించారు. అష్టోత్తర శతనామార్చన పూజలు చేశారు. చుట్టుపక్కల గ్రామా ల నుంచి భక్తులు విచ్చేసి స్వామి, అమ్మవార్లను దర్శించుకున్నారు. ఏర్పాట్లను దేవస్థానం ఈఓ ఎం.అరుణ్ కుమార్, దేవస్థానం చైర్మన్ డీవీ కృష్ణంరాజు, పాలకమండలి సభ్యులు పర్యవేక్షించారు.

బ్రాంచి రైల్వే లైన్‌లో పెరిగిన గూడ్స్ రైళ్లు



ఆకివీడు రైల్వే స్టేషన్‌లో నిలిచిన గూడ్స్ రైలు

ఆకివీడు: మెయిన్ లైన్‌లో ఏలూరు వద్ద వంతెన నిర్మాణంతో బ్రాంచి రైల్వేలైన్‌కు గూడ్స్ రైళ్లు, మూడు ఎక్స్‌ప్రెస్ రైళ్లను మళ్లించారు. నిడదవోలు నుంచి భీమవరం మీదుగా గుడివాడ, విజయవాడ వైపునకు రైళ్లు వెళుతున్నాయి. రెండు రోజులుగా గూడ్స్ రైళ్ల సంఖ్య బ్రాంచి లైన్‌లో పెరగడంతో ట్రాక్ ఆపరేషన్ ఒత్తిడిని తట్టుకునేందుకు పలు రైల్వే స్టేషన్లలో గూడ్స్ రైళ్లను నిలుపుదల చేస్తున్నారు. ఈ నెల 21న నిడదవోలు నుంచి రామవరప్పాడు వరకు ప్రతి స్టేషన్‌లో ఒక గూడ్స్ రైలు నిలిచిపోయి, సమయానుకూలంగా వెళ్లింది. ఈ లైన్‌లో రైళ్ల రద్దీ పెరిగింది. ప్రతి రోజూ నడిచే రైళ్లకు మార్గం కల్పిస్తూ, గూడ్స్ రైళ్లను ఆయా స్టేషన్లలో పావుగంట నుంచి రెండు మూడు గంటల వరకు నిలుపుదల చేయాల్సిన పరిస్థితి వచ్చిందని రైల్వే అధికారి ఒకరు తెలిపారు. ఇటీవల గూడ్స్ రైలు, ఎక్స్‌ప్రెస్‌రైళ్లు ఢీకొన్న ఘటన తరువాత గూడ్స్ రైళ్ల వేగానికి కళ్లెం వేసి, ఆయా స్టేషన్లలో కొద్ది సేపు నిలుపుదల చేస్తున్నామని, ఆపరేషన్ ఒత్తిళ్లు లేకుండా మార్గం సుగమం చేస్తున్నామని వివరించారు. గూడ్స్ రైళ్ల రాకపోకలు పెరగడంతో ఆయా రైల్వే గేట్ల వద్ద ప్రజలు, వాహనచోదకులు పడుగాపులు పడాల్సి వస్తోంది. అనుకూలమైన చోట్ల అండర్ టన్నల్స్ నిర్మించాలని రైల్వే శాఖను కోరుతున్నారు.

ఘనంగా జాతీయ పతాక ఆమోద దినోత్సవం

ఆకివీడు: జాతీయ జెండా ఆమోద దినోత్సవాన్ని ఆకివీడు మండలం దుంపగడప గ్రామంలోని వీవీ గిరి ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో శనివారం ఘనంగా నిర్వహించారు. జెండా విశిష్టతను ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ సీహెచ్ హరనాథ్ విద్యార్థులకు వివరించారు. దేశ భక్తిని చాటే విధంగా జెండా వందనం చేయాలని, జాతీయ జెండాను పవిత్రంగా చూడాలని చెప్పారు. జెండాను రూపొందించిన పింగళి వెంకయ్యను స్ఫూర్తిగా తీసుకుని జాతీయ స్ఫూర్తిని ప్రతి విద్యార్థీ పెంపొందించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో అధ్యాపకులు, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో కూరగాయల సాగు



ప్రకృతి వ్యవసాయంపై అవగహన కల్పిస్తున్న దృశ్యం

వీరవాసరం: వీరవాసరం మండలం కొణితివాడ పంచాయతీ నరసన్నచెరువుపాలెం గ్రామంలో సూర్య మండలం మోడల్ నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మండల ఇన్‌చార్జి దేవి నాగరాజు, వినోద్ కుమార్ మాట్లాడుతూ సూర్య మండలం ఉద్దేశాన్ని వివరించారు. సూర్య మండలంలో ప్రకృతి వ్యవసాయ పద్ధతిలో 365 రోజులకు సరిపడా కూరగాయలు తీసుకోవచ్చని చెప్పారు. రసాయన ఎరువులు వాడకుండా జీవామృతం, కోడిగుడ్డు నిమ్మరసం, అగ్నిస్త్రం తదితర కషాయలను వాడాలని సూచించారు. కార్యక్రమంలో ఐసీఆర్పీలు సతీష్ కుమారి, అంబేడ్కర్, శ్రీనివాస్, మురళీ కుమారి, నవీన్ కుమార్, ఎస్‌హెచ్‌జీ మహిళలు, రైతులు పాల్గొన్నారు.


బాల కార్మికులను గుర్తించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్వో కృష్ణవేణి

భీమవరం(ప్రకాశం చౌక్): బాల కార్మికులను గుర్తించడంతో పాటు వారి పర్యవేక్షణ ముఖ్యమని జిల్లా రెవెన్యూ అధికారి కె.కృష్ణవేణి అన్నారు. శనివారం కలెక్టరేట్‌లో బాల కార్మికుల జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశం నిర్వహించారు. బాల కార్మికులను గుర్తించిన అనంతరం వారిని పాఠశాలలో చేర్పించడం, సంరక్షణ ఏర్పాట్లు తదితర విషయాలపై నిరంతర పర్యవేక్షణ ఉండాలని ఆమె సూచించారు. బాల కార్మికులను గుర్తించేందుకు తరచూ తనిఖీలు చేయాలన్నారు. జిల్లా కార్మిక శాఖ అధికారి ఎ.లక్ష్మి మాట్లాడుతూ నెల రోజులుగా 33 మందిని గుర్తించి వారిని పాఠశాలల్లో చేర్పించామన్నారు. నరసాపురం మండలంలోని ఇటుక బట్టీల్లో పనిచేసేందుకు బెంగాలీ కూలీలు వస్తుంటారని, వారి పిల్లల చదువులకు బెంగాలీ టీచర్‌ను ఏర్పాటుచేయాలని సమావేశం దృష్టికి తీసుకొచ్చారు. ఏఎస్పీ ఏవీ సుబ్బరాజు, ఆర్డీఓ దాసి రాజు, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులు సీహెచ్ సత్యనారాయణ రావు పాల్గొన్నారు.

ప్రత్యేక లోక్ అదాలత్



ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహిస్తున్న దృశ్యం

సాక్షి, భీమవరం: సీనియర్ సివిల్ జడ్జి కోర్టు హాల్లో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. భూనష్ట పరిహారం క్రింద రెవెన్యూ డిపార్ట్‌మెంట్‌పై నమోదైన కేసులను విచారించారు. ఈ కేసులు రాజీ అవ్వడానికి కొంత సమయం కావాలని రెవెన్యూ శాఖ కోరింది. లోక్ అదాలత్‌కు న్యాయమూర్తిగా సీనియర్ సివిల్ జడ్జి బి.అప్పలస్వామి, సభ్యులుగా ఎం. దుర్గా ప్రసాద్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు ఎం.రమణరావు, ఏజీపీ యు.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సబ్ జైల్ తనిఖీ

స్థానిక ప్రత్యేక కారాగారాన్ని భీమవరం 2వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి డి.ధనరాజు తనిఖీ చేశారు. వంటశాల, జైల్ ప్రాంగణాన్ని పరిశీలించారు. ఆర్థిక స్థోమత లేని వారు మండల న్యాయ సేవాధికార సంస్థ అందించే ఉచిత న్యాయ సహాయాన్ని ఉపయోగించుకోవాలని కోరారు. ప్రతి ముద్దాయి క్రమశిక్షణ, పరివర్తన, బాధ్యతతో ఉంటే త్వరితగతిన కేసుల నుంచి విముక్తి పొందవచ్చని సూచించారు. ప్యానల్ లాయర్ బి.లోకేష్, పి.అంబేద్కర్, జి.కుమార్ స్వామి పాల్గొన్నారు.

బాలికల వసతి గృహ సందర్శన

భీమవరం మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో 1వ అదనపు జూనియర్ సివిల్ జడ్జి జి.సురేష్ బాబు స్థానిక నర్సయ్య అగ్రహారంలోని బీసీ సంక్షేమ కళాశాల బాలికల వసతి గృహాన్ని ఆకస్మిక తనిఖీ చేశారు. బాలికలతో నేరుగా మాట్లాడి హాస్టల్‌లో అందుతోన్న ఆహార పదార్థాలు, విజిటింగ్ డాక్టర్ గురించి, మంచినీరు, డ్రెయినేజీ పరిసరాలను పరిశీలించారు.

వీవోఏల సమస్యలు పరిష్కరించాలి

సాక్షి, భీమవరం: వీవోఏల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు జేఎన్‌వీ గోపాలన్ ప్రభుత్వాన్ని కోరారు. శనివారం స్థానిక యూటీఎఫ్ కార్యాలయంలో అడ్డగర్ల అజయ్‌కుమారి అధ్యక్షతన ఏర్పాటుచేసిన వీవోఏల జిల్లా సమావేశంలో ఆయన మాట్లాడారు. వీవోఏల సమస్యలను పరిష్కారం చేయాలని కోరారు. సమావేశంలో సంఘం నాయకురాలు నిర్మలదేవి, శ్రామిక మహిళ నాయకురాలు డి.కళ్యాణి, తోట పద్మావతి, గోవిందమ్మ, సూర్య కుమారి, వరలక్ష్మి, విజయమ్మ, కనకదుర్గ, జాన్సీ, అనురాధ తదితరులు పాల్గొన్నారు.

సిబ్బందిని నియమించాలి

ఆకివీడు: పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలకు ఆటంకం లేకుండా పెదకాపవరం సచివాలయంలో ఖాళీ పోస్టులను భర్తీ చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ సచివాలయ డిజిటల్ అసిస్టెంట్ డిప్యూటేషన్‌పై అమరావతి వెళ్లారని తెలిపారు. ఇంజినీరింగ్ అసిస్టెంట్ తన ఉద్యోగానికి రిజైన్ ఇచ్చారని, సర్వేయిర్, మహిళా పోలీస్‌లేరని పేర్కొన్నారు. డిజిటల్ అసిస్టెంట్‌గా ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహిస్తున్న వెల్ఫేర్ అసిస్టెంట్‌ను ఇటీవల కలెక్టర్ సస్పెండ్ చేశారని వివరించారు. ప్రస్తుతం ఫిషరీస్, ఆర్బీకే అసిస్టెంట్లు, ఇన్‌చార్జి కార్యదర్శి, ఇన్‌చార్జి వీఆర్వోలు పని చేస్తున్నారని తెలిపారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

సాక్షి, భీమవరం: స్థానిక సబ్ స్టేషన్ మరమ్మతులు నిమిత్తం ఆదివారం ఉదయం ఏడు గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పీర్ అహ్మద్ ఖాన్ తెలిపారు. హౌసింగ్ బోర్డ్ ఏరియా, నరసయ్య అగ్రహారం, ఇండస్ట్రియల్ ఏరియా, చిన్న రంగనిపాలెం, సౌభాగ్య నగర్, బొక్కవారి పాలెం, వేండ్ర కెనాల్ రోడ్, కలెక్టరేట్ ఆఫీస్, మారుతి నగర్, వాటర్ వర్క్స్ ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

భీమవరం మండలంలో భారీ వర్షం

భీమవరం అర్బన్: అల్పపీడనం ప్రభావంతో భీమవరం మండలం యనమదుర్రు, దిరుసుమర్రు, అనాకోడేరు, తాడేరు, బేతపూడి, చినఅమిరం, గొల్లవానితిప్ప తదితర గ్రామాల్లో శనివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ఈ వర్షం నారుమడులకు, వరినాట్లు వేసేందుకు, చెరువుల్లో చేపల ఎదుగుదలకు ఉపయోగపడుతుందని రైతులు చెబుతున్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తి మృతి

పాలకోడేరు: రోడ్డు ప్రమాదంలో గాయపడి చికిత్స పొంది ఇంటి వద్ద కోలుకుంటున్న ఎ.వీరవెంకట నరసింహరావు (45) మృతి చెందినట్టు ఎస్సై నాళం శ్రీనివాసరావు శనివారం తెలిపారు. శృంగవృక్షం గ్రామానికి చెందిన వీరవెంకట నరసింహరావును గత నెల 19న విస్సాకోడేరు గ్రామంలో మినీ వ్యాను ఢీకొట్టింది. ఆయన తలకు తీవ్ర గామయమడంతో చికిత్స చేయించారు. రోడ్డు ప్రమాదంలో మృతి చెందినట్లు కేసును మార్పు చేశామని పోలీసులు తెలిపారు.

భర్త అదృశ్యంపై కేసు

పాలకోడేరు: శృంగవృక్షం గ్రామానికి చెందిన తన భర్త డి.శేఖర్ బాబు కనిపించడం లేదంటూ భార్య రాహేలమ్మ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్టు ఎస్సై నాళం శ్రీనివాసరావు తెలిపారు. శేఖర్ బాబు 2023 మే 17న తణుకు వెళ్తానని చెప్పి తిరిగి రాలేదని పేర్కొన్నారు.

ప్రశాంతంగా ప్రత్యేక లోక్ అదాలత్

నరసాపురం రూరల్: రాష్ట్ర, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు భూ సేకరణ కేసులు, మోటారు వాహనాల యాక్సిడెంట్ కేసులు పరిష్కారం నిమిత్తం శనివారం ప్రత్యే లోక్ అదాలత్ నిర్వహించారు. నరసాపురం పదో అదనపు జిల్లా జడ్జి, మండల న్యాయసేవా సంస్థ చైర్మన్ పి.విజయదుర్గ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమం పలు కేసులను వాయిదా వేసినట్లు తెలిపారు.